క్లుప్తంగా

వైద్యులకు సత్కారం



నల్లజర్ల పీహెచ్‌సీలో వైద్యులను సత్కరిస్తున్న వైద్య ఉద్యోగులు

నల్లజర్ల: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా శనివారం నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు తెల్లం గంగాధర రావు, డాక్టరు సిరాజుద్దీలను వైద్య ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీవీవీ ప్రసాద్ మాట్లాడుతూ దేవుడి తర్వాత దేవుడు ఎవరైనా ఉన్నారంటే వారు వైద్యులు మాత్రమే అన్నారు.పూలమాలలు, శాలువాలతో డాక్టర్లను సత్కరించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ పలివెల ప్రసాద్, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్నవరప్పాడులో భక్తుల రద్దీ



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి వారు

పెరవలి: శనివారం మండలంలోని అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పూలతో అలంకరించారు. తెల్లవారు జామునే భారీగా మహిళా భక్తులు తరలి రావడంతో ఆలయంలో దీపాలు వెలిగించారు. పురోహితులు స్వామి వారికి అభిషేకం నిర్వహించాక భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులకు ఉదయం ఉచిత ప్రసాదాల పంపిణీతో పాటు 10 గంటల నుంచి అన్న సమారాధన నిర్వహించారు. తణుకుకు చెందిన గమిని గోపాలకృష్ణమూర్తి, నాగలక్ష్మి దంపతులు అన్నదానాన్ని ప్రారంభించారు. సుమారు ఆరు వేల మంది భక్తులు స్వామి వారి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. ఎన్నికల నేపథ్యం వీఐపీ దర్శనాలను నిలిపివేశామని, భక్తులు గమనించాలని ఆయన కోరారు.

నదిలో మునిగి యువకుడి మృతి



మృతుడు పుల్లారావు

తాళ్లపూడి: వేగేశ్వరపురం గోదావరి మేరీమాత దీక్ష పూర్తి చేసుకుని, కుటుంబ సభ్యులు, బంధువులతో కలసి అమ్మవారి దర్శనానికి వచ్చిన ఓ యువకుడు ప్రమాదవశాత్తూ గోదావరి నదిలో మునిగి మృతి చెందాడు. తాళ్లపూడి ఎస్సై టి.శ్యామ్‌సుందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం, గుడిపూడి గ్రామానికి చెందిన బిల్లుగుడి పుల్లారావు (20), కుటుంబీకులు, బంధువులు వేగేశ్వరపురం గోదావరి మేరీమాత 40 రోజుల దీక్ష చేశారు. ఈస్టర్ పర్వదినానికి ముందు రోజున దీక్ష విరమణ కోసం పుల్లారావు వారందరితో కలసి శనివారం ఈ ఆలయానికి వచ్చాడు. ఉదయం తొమ్మిదింటికి గోదావరి నదిలో స్నానం చేయడానికి దిగిన పుల్లారావు ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి పోసాగాడు. అదే సమయంలో సమీపంలోనే స్నానం చేస్తున్న అతడి తండ్రి పాట్టయ్య, బంధువులు హేమంత్, రవికుమార్‌లు పుల్లారావును రక్షించేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. నదిలో మునిగి అతడు చనిపోయాడు. కాగా ఈ దుర్ఘటనపై అతడి తండ్రి పాట్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్యామ్‌సుందర్ తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



చంద్రమ్మ (ఫైల్)

గోపాలపురం: మండలంలోని గోవరం గ్రామంలో శనివారం సొంగ చంద్రమ్మ (62) అనే ఉపాధి కూలీ విధుల్లో ఉండగా మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన చంద్రమ్మ ఉదయం ఉదయం ఉపాధి పనికి వెళ్లింది. పనులు చేస్తుండగా ఆమెకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయిందని ఉపాధి ఏపీఓ ఎస్.రమణ తెలిపారు. సహచర కూలీలు చూసేసరికి ఆమె ప్రాణాలు విడిచింది.

మహిళకు గాయాలు

గోపాలపురం: దేవరపల్లి మండలం గొల్లగూడెం అవంతీ ఫీడ్స్ ఫ్యాక్టరీ సమీపంలో శనివారం ఉదయం ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గోపాలపురానికి చెందిన దొప్పసాని నాగలక్ష్మి అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గోపాలపురం సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం ఆమెను మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు డాక్టర్ హేమకుమార్ తెలిపారు.

కాపవరంలో దుర్గేష్ ప్రచారం

పెరవలి: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నిడదవోలు అసెంబ్లీ అభ్యర్థి కందుల దుర్గేష్ శనివారం మండలంలోని కాపవరం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులతో ఆయన సమావేశాలు నిర్వహించి అందరినీ పరిచయం చేసుకున్నారు. ఎన్నికల్లో తనకు సహకరించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, జనసేన పార్టీ కన్వీనర్ ప్రసాద్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రగతి మల్లెలు

- అభివృద్ధి పథంలో సమిశ్రగూడెం పంచాయతీ
- 58 నెలల్లో రూ.38.52 కోట్ల విలువైన సంక్షేమ పథకాలు
- రూ.19.24 కోట్లతో అభివృద్ధి పనులు
- గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ప్రాధాన్యం

నిడదవోలు రూరల్: పల్లెలను ప్రగతి బాట పట్టించి, గ్రామీణులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలన్నదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం ప్రభుత్వం రూ.కోట్లలో మంజూరు చేసింది. ఫలితంగా నిడదవోలు మండలంలో మేజర్ పంచాయతీ అయిన సమిశ్రగూడెం నేడు అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు సహకారంతో ఈ పంచాయతీ పరిధిలో రూ.19.24 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేశారు. దీనికి అదనంగా మరో రూ.38.52 కోట్లతో వివిధ సంక్షేమ పథకాలను అర్హులకు అందించారు. వైఎస్సార్, జగనన్న కాలనీల్లో గ్రావెల్ రోడ్లు వేయించారు. ఇప్పుడక్కడ కాలికి మట్టి అంటని సీసీ రోడ్లు, దుర్వాసన రాని డ్రైన్లు, రక్షిత మంచినీటి పైపులైన్లు, వీధి దీపాలు ఉన్నాయి. ఈ గ్రామంలో ప్రగతి మల్లెలు విరబూస్తున్నాయి.

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం

బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి చిహ్నం సచివాలయాలు. ఆ ఘనత ఈ వ్యవస్థను తీసుకొచ్చిన సీఎం జగనన్నకే దక్కుతుంది. అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు సమిశ్రగూడెం గ్రామంలో గడప వద్దకే అందిస్తున్నారు. ప్రజా సమస్యలు పరిష్కారానికి సచివాలయాలు వేదికగా మారడంతో పాటు సంక్షేమ పథకాల పంపిణీలో కీలకపాత్ర పోషిస్తున్నాయి.ఈ పంచాయతీ పరిధిలో 10,500 జనాభా ఉండగా, 7,200 మంది ఓటర్లున్నారు. 2,800 కుటుంబాలు నివశిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నీ కలిపి ప్రస్తుతం 1,300 మందికి పెన్షన్లు అందజేస్తున్నారు. ప్రధానంగా ఎస్సీ, బీసీ, మైనార్టీ, కాపు ఏరియాల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించారు.

- సమిశ్రగూడెంలో రూ.80 లక్షలతో నిర్మించిన రెండు గ్రామ సచివాలయ భవనాలు, రూ.43.60 లక్షలతో నిర్మించిన రెండు రైతు భరోసా కేంద్రం భవనాలు, రూ.23.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం, రూ.22.20 లక్షలతో నిర్మించిన మండల పరిషత్ కార్యాలయ మొదటి అంతస్తు భవన నిర్మాణాలను పూర్తిచేసి ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు ప్రారంభించారు.
- గ్రామస్తుల దాహార్తి తీర్చేందుకు జలజీవన్ మిషన్‌లో భాగంగా రూ.72 లక్షలతో పైపులైన్లు విస్తరించారు. జగనన్న కాలనీలో రూ.37 లక్షలతో నూతనంగా పైపులైన్లు ఏర్పాటుచేశారు.
- వైఎస్సార్, జగనన్న కాలనీలో 534 మంది లబ్దిదారులకు ఇళ్లస్థలాలు మంజూరు చేయడంతో పాటు 147 మంది లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించారు. ఇప్పటికే 310 మంది లబ్ధిదారులు సొంతింటి కల సాకారం చేసుకుని ఇళ్లు నిర్మించి గృహప్రవేశాలు చేశారు.
- నాడు–నేడు పథకంలో భాగంగా స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను రూ.25 లక్షలు, ప్రాథమిక పాఠశాలలను రూ.25 లక్షలతో అభివృద్ధి చేశారు. ఉపాధిహామీ పథకం నిధులతో హైస్కూల్‌కు ప్రహరీ నిర్మించారు.



సమిశ్రగూడెంలోని జగనన్న కాలనీ



సమిశ్రగూడెంలోని ఓ వీధిలోని సీసీ రోడ్డు



సమిశ్రగూడెంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం



వైఎస్సార్ కాలనీలో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్

గ్రామాభివృద్ధే లక్ష్యంగా..



సమిశ్రగూడెం గ్రామాభివృద్ధే లక్ష్యంగా పంచాయతీ పాలకవర్గం, వైఎస్సార్ సీపీ స్థానికులు నాయకులు కృషి చేస్తున్నారు. నేను వలంటీర్‌గా పనిచేశాను. సీఎం జగనన్న ఇచ్చిన అవకాశంతో మా పంచాయతీ సర్పంచ్‌గా పోటీ చేశాను. మా ఊరి ప్రజలంతా కలిసి నన్ను భారీ మెజార్టీతో గెలిపించారు. దీంతో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నాను. సచివాలయ వ్యవస్థ వల్ల అధికారులు నిత్యం అందుబాటులో ఉండడంతో సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం అవుతున్నాయి.

–దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక, సర్పంచ్, సమిశ్రగూడెం

పార్టీలకు అతీతంగా పథకాలు



పార్టీలకు అతీతంగా గ్రామంలోని ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. గతంలో మా గ్రామంలోని వైఎస్సార్ కాలనీలో రోడ్లు, డ్రైన్లు లేకపోవడంతో ఇబ్బంది పడేవారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మా ఊరిలో రోడ్లు, డ్రైన్ల నిర్మాణంతో కళకళలాడుతోంది. ప్రభుత్వం ద్వారా అర్హులైన 534 మంది పేదలకు ఇళ్లస్థలాలు అందించడం ఆనందంగా ఉంది. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడి సహకారంతో సమిశ్రగూడెం గ్రామం అభివృద్ధిలో దూసుకుపోతోంది.

– గజ్జరపు శ్రీరమేష్, వైఎస్సార్ సీపీ గ్రామ, సొసైటీ అధ్యక్షుడు, సమిశ్రగూడెం

ప్రశాంతంగా జీవించేలా ప్రణాళికలు



ప్రజలంతా ప్రశాంతంగా జీవించేలా ప్రణాళికలు రూపొందించాం. ఐదేళ్లలో నిడదవోలు పట్టణంతో పాటు ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేశాను. సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ క్లినిక్‌లకు శాశ్వత భవనాలతో పాటు సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించాం. భవిష్యత్తులో ప్రజలను, అధికారులను సమన్వయం చేసుకుని నిడదవోలు నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతాను.

– జి.శ్రీనివాస్‌నాయుడు, ఎమ్మెల్యే, నిడదవోలు

రబీకి పూర్తి స్థాయిలో నీరందించాం



శెట్టిపేట లాకు వద్ద జలవనరుల శాఖ సిబ్బందిని అభినందిస్తున్న ఈఈ దక్షిణామూర్తి

నిడదవోలు రూరల్: పశ్చిమ డెల్టా పరిధిలో సాగవుతున్న వరి పంటకు పూర్తిస్థాయిలో నీటిని అందించామని జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) ఎం.దక్షిణామూర్తి అన్నారు. శెట్టిపేట హెడ్ లాకు వద్ద కొండాలమ్మ వారి ఆలయంలో జాతర సందర్భంగా శనివారం ఆ శాఖ అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాగు నీరు అందించడంలో కీలకపాత్ర పోషించిన సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ నిడదవోలు యూనిట్ అధ్యక్షుడు కె.నందిబాబు, మాణిక్యాలరావు, లాక్ సూపరింటెండెంట్లు యు.శ్రీనివాస్, చిక్కాల బ్రహ్మాజీరావు, ముప్పిడి విజయ్‌కుమార్, లస్కర్లు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

బౌద్ధ దమ్మ పీఠంలో ఉచిత పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కోచింగ్

ఉండ్రాజవరం: పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు స్థానిక బౌద్ధ దమ్మ పీఠంలో ఏప్రిల్ ఐదో తేదీ నుంచి ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు బౌద్ధ భిక్షువు భంతే ఆనాలియో శనివారం తెలిపారు. ఈ కోచింగ్ రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుగుతుందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధిస్తారని చెప్పారు. ప్రతి రోజూ పరీక్షతో పాటు మొత్తం 10 గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తారన్నారు. గత రెండేళ్లలో ధమ్మ పీఠంలో నిర్వహించిన పాలిసెట్ కోచింగ్‌కు హాజరైన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. అనేక మంది విద్యార్థులు ప్రస్తుతం ప్రముఖ పాలిటెక్నిక్ కళాశాలల్లో సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ మొదలైన కోర్సులు చదువుతున్నారన్నారు. స్థల ప్రభావం వలన 90 మంది విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉందన్నారు. రిజిస్ట్రేషన్ కోసం టి.కృష్ణ సెల్ నంబర్ 98668 48509ను సంప్రదించాలన్నారు.

మేలు చేశాం.. మరోసారి గెలిపించండి



కానూరులో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్ నాయుడు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్ నాయుడు
- కానూరులో గడప గడపకూ..

పెరవలి: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలు పేదలు, పెత్తందార్ల మధ్య సాగే యుద్ధం వంటిదని, పేదల పక్షాన నిలిచిన జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయడానికి సహకరించాలని వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్ నాయుడు ప్రజలను కోరారు. మండలంలోని కానూరులో శనివారం ఆయన పార్టీ శ్రేణులతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాస్‌నాయుడు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి, మీ ముందుకు వచ్చామని ఈ సందర్భంగా ఆయన న్నారు. అలాగే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజా సమస్యలు గుర్తించిన ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమం అందని కుటుంబం, అభివృద్ధి జరగని గ్రామం లేదని ఆయన గుర్తు చేశారు. అటువంటి ప్రభుత్వానికి మరోసారి మీరంతా అండగా ఉండాలని ఆయన కోరారు. గ్రామంలోని 280 గృహాలను సందర్శించిన శ్రీనివాస్‌నాయుడు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారుడు వరుణ్ సాయి, ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, సర్పంచ్ భావన మధు, కొమ్మిశెట్టి రాము, తోట సురేష్, పార్టీ నాయకులు అంబటి బ్రహ్మయ్య, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు వీడ్కోలు సన్మానం



హెచ్‌ఎం విశ్వప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఉండ్రాజవరం: మట్టిలో మాణిక్యాలను వెలికితీసే వారు ఉపాధ్యాయులని ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అన్నారు. ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన వి.విశ్వప్రసాద్ సన్మాన సభ శనివారం పాఠశాల ఆవరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ 39 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా ఉత్తమ బోధన చేయడంతో పాటు మూడేళ్లుగా ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా విశేష సేవలందించారని విశ్వప్రసాద్‌ను కొనియాడారు. ఎందరినో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడంలో ఆయన కృషి చేశారన్నారు. అనంతరం వి.విశ్వప్రసాద్, మాధురి దంపతులను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ మెండే వెంకట్రావు, ఎంఈఓలు సక్సేనా రాజు, శారదా జ్యోత్స్న, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కర్రెల సోమేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా నాయకుడు ఐ.రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్నకే మళ్లీ పట్టం కడదాం

- మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ
- 26వ వార్డులో ముమ్మరంగా ప్రచారం



నిడదవోలు 26వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, పార్టీ శ్రేణులు

నిడదవోలు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్ని పార్టీలు జత కట్టి వచ్చినా, మనందరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కడదామని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని 26వ వార్డులో శనివారం వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. పార్టీ శ్రేణులతో కలసి మున్సిపల్ చైర్మన్ ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రభుత్వం ఇప్పటి వరకూ అందించిన సంక్షేమ పథకాలు, పట్టణంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ నవరత్నాల పేరుతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అమలు కావాలంటే రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న జి.శ్రీనివాస్‌నాయుడు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ల విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ ఎస్‌కే చాన్‌బాషా, కౌన్సిలర్లు తోలేటి ఝాన్సీ, గోపిరెడ్డి శ్రీనివాస్, పార్టీ నాయకులు గంగుల గోపియాదవ్, తోలేటి కోటేశ్వరరావు, ఎండీ ఫయాజ్, ఆలమూరి రాజ, ఇజహర్ అహ్మద్, దారపురెడ్డి అజయ్‌కుమార్, ముప్పా వెంకటేశ్వరరావు, మానే వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సేవను సామాజిక బాధ్యతగా తీసుకోండి

- కార్పొరేట్ సంస్థలకు కలెక్టర్ మాధవీలత సూచన
- ప్రభుత్వాసుపత్రిలో ఆప్తాలమిక్ పరికరం ప్రారంభం
- డెక్కన్ కెమికల్స్ ఆర్థిక సాయంతో ఏర్పాటు



కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆప్తాలమిక్ పరికరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

కొవ్వూరు: సేవా కార్యక్రమాలకు సీఎస్ఆర్ నిధులను వెచ్చించడాన్ని కార్పొరేట్ సంస్థలు, పెద్ద కంపెనీలు సామాజిక బాధ్యతగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత సూచించారు. కంటి శస్త్ర చికిత్సల కోసం పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో రూ.20 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన అప్తాలమిక్ పరికరాన్ని కలెక్టర్ శనివారం పరిశీలించారు. డెక్కన్ కెమికల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ జి.మనోహర్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ఈ నేత్ర వైద్య పరికరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ రానున్న రోజుల్లో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో కాటరాక్ట్ వంటి ఆధునిక కంటి శస్త్ర చికిత్సలు అందుబాటులోకి రానున్నాయన్నారు. సామాజిక బాధ్యతగా డెక్కన్ కెమికల్స్ ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మనోహర్ ఈ ఖరీదైన పరికరాన్ని సమకూర్చడం అభినందనీయం అన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది దాతలు ముందుకు రావాలని కోరారు. అనంతరం ఆసుపత్రిలోని ప్రసూతి వార్డులోని వసతులను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య, అనుబంధ వైద్య సేవల గురించి డాక్టర్లను ఆమె అడిగి తెలుసుకున్నారు. రక్తహీనతను అధిగమించేందుకు ఐరన్, పోషకాలుండే ఆహారాన్ని తప్పకుండా తీసుకునేలా రోగులకు అవగాహన కల్పించాలన్నారు. కంటి వైద్యులు శాంతి కమల, అనపర్తి వైద్యుడు అశోక్ కుమార్‌ల ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.సాయికిరణ్ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం ప్రారంభం



సబ్ కలెక్టర్ క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత

కొవ్వూరు: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రాగంణంలో కొత్తగా నిర్మించిన సబ్ కలెక్టర్ క్యాంపు కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇక మీదుట సబ్ కలెక్టర్ ప్రజలకు మరింతగా అందుబాటులో ఉండి సేవలందించేందుకు ఈ కార్యాలయం ఉపకరిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఈఈ పి.పరశురామ్, ఏఈ చక్రవర్తి, సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి కె.రవి విక్రమ్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొవ్వూరు: రోడ్డు కం రైల్ వంతెనపై మోటారు సైకిల్‌ను కారు ఢీకొట్టిన ప్రమాదంలో పట్టణానికి చెందిన కోటిచుక్కల సత్యనారాయణ అనే వ్యక్తితో పాటు మరో యువకుడు గాయపడ్డాడు. సత్యనారాయణ రాజమహేంద్రవరంలో స్టిక్కరింగ్ పనులు చేస్తుంటాడు. ఆయన శనివారం సాయంత్రం రాజమహేంద్రవంలో పని ముగించుకుని ఇంటికి బయల్దేరాడు. మధ్యలో కోటిపల్లి బస్టాండ్ స్టాండ్ వద్ద ఒక యువకుడ్ని తన బైక్ ఎక్కించుకుని కొవ్వూరు వస్తుండగా వారిద్దరూ ప్రమాదానికి గురయ్యారు. క్షతగాత్రులు ఇద్దరినీ రాజమహేంద్రవరంలోని ఆసుపత్రికి తరలించారని కొవ్వూరు పట్టణ ఎస్సై మహ్మద్ జుబేర్ తెలిపారు.

విధుల నుంచి తొలగింపు

దేవరపల్లి: బందపురం వలంటీర్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్టు ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు తెలిపారు. బందపురం సచివాలయం క్లస్టర్ 13లో పని చేస్తున్న వలంటీర్ తన వాట్సప్ ద్వారా రాజకీయ మెసేజ్ చేసి సాధారణ ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టు విధులకు ఆటంకం కలిగించారన్నారు. అందుకే విధుల నుంచి తొలగించామన్నారు.

అందుబాటులో ఉంటా.. ఆశీర్వదించండి



భీమోలులో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి వనిత

- వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత
- భీమోలులో ఇంటింటా ప్రచారం

గోపాలపురం: అందుబాటులో ఉంటాను.. ఆశీర్వదించండి అంటూ రాష్ట్ర హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత అభ్యర్థించారు. మండలంలోని భీమోలులో శనివారం ఆమె పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రజల సమస్యలు తెలుసుకుని, వారి అవసరాలకు అనుగుణంగా పనిచేసే నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని ఈ సందర్భంగా ఆమె అన్నారు. ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరిస్తున్నారన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే కరపత్రాలను ఆమె పంపిణీ చేశారు. ప్రచారంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ళ భాస్కరరావు, సర్పంచ్ అన్నెపు వెంకటలక్ష్మి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బండారు జగన్‌మోహన్‌రావు, నాయకులు పోతిరెడ్డి నాగరాజు, యండపల్లి కవిత, వెలగా శ్రీరామమూర్తి ముచ్చికర్ల రవి, పిన్నమనేని చినబాబు, దుగ్గిరాల రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఈస్టర్ పండుగకు సమాధుల ముస్తాబు



నిడదవోలులో క్రైస్తవ సమాధులను శుభ్రం చేస్తున్న యువత

నిడదవోలు: మానవాళి పాప విముక్తి కోసం శిలువపై ఏసుక్రీస్తు మరణ దినమైన గుడ్ ఫ్రైడే తర్వాత మూడో రోజు ఆదివారం క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ఈస్టర్ (పునర్థాన పండుగ) నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. క్రైస్తవులకు క్రిస్మస్ తర్వాత అతి ముఖ్యమైన పండుగ ఈస్టర్. ఈ పర్వదినం నాడు క్రైస్తవులు తమ పూర్వీకుల సమాధులను శుభ్రం చేసి, పూలతో అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించి, వారి ఆత్మలకు శాంతి చేకూరాలంటూ ప్రార్థన చేస్తారు. ఈ క్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ నాయకుడు గుర్రం జేమ్స్, కౌన్సిలర్ ఉసురుమర్తి జాన్‌బాబు పర్యవేక్షణలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని క్రైస్తవుల సమాధుల తోటను నాలుగు రోజులుగా శుభ్రం చేస్తున్నారు. సమాధుల తోటలో విద్యుత్తు సదుపాయం కల్పించారు. తోటలో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాలను తొలగించారు. క్రైస్తవులు తమ పూర్వికుల సమాధులకు రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. ఈస్టర్ పండుగ రోజున క్రైస్తవులు తమ పెద్దల సమాధుల వద్దకు వేకువ జామున 4 గంటలకు చేరుకుంటారు. సమాధులపై కొవ్వొత్తులు వెలిగించి, ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ వివిధ రకాల పూలతో అలంకరిస్తారు. అనంతరం ప్రార్థనా మందిరాల్లో ఈస్టర్ ప్రత్యేక ఆరాధనలు నిర్వహిస్తారు.